క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన ఎంఈఓ

ఇల్లెందురూరల్: ఇల్లెందు ఎంఈఓగా సుభాష్‌నగర్ హైస్కూల్ హెచ్‌ఎం ఉమాశంకర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల విద్యావనరుల కేంద్రంలో కార్యాలయ సిబ్బందితో సమావేశమై వేసవిలో విద్యాప్రణాళిక, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఉపాధ్యాయుల శిక్షణ, జూన్ 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే బడి బాట కార్యక్రమాలకు ఉపాధ్యాయులను సన్నద్ధం చేయాలని సూచించారు. జిల్లా కేంద్రం నుంచి వచ్చే పాఠ్యపుస్తకాలను పాఠశాలల వారీగా ఇండెంట్‌కు అనుగుణంగా సరఫరా చేయాలన్నారు. మాజీ ఎంఈఓలు పిల్లి శ్రీనివాస్, టీవీఆర్‌ఎన్ స్వామి పాల్గొన్నారు.

కార్యాలయ ఉద్యోగి వివాహం జరిపించిన ఎమ్మెల్యే


శేఖర్ రిసెప్షన్‌లో ఎమ్మెల్యే దంపతులు

ఇల్లెందు: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య క్యాంపు కార్యాలయంలో పనిచేసే సబార్డినేట్ శేఖర్ వివాహాన్ని ఎమ్మెల్యే అన్నీ తానై జరిపించారు. ఇటీవల వివాహం జరగగా, గురువారం ఇల్లెందు సీఈఆర్ క్లబ్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య–లక్ష్మి అంతా తామై వ్యవహరించగా పార్టీ నాయకులు హాజరయ్యారు.

చర్యలు తీసుకోండి..

పాల్వంచరూరల్: భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీపై సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు గురువారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పానిశెట్టి వెంకటేశ్వర్లు, భట్టు నరేష్, మాలోతు ప్రశాంత్, మాదారపు లక్ష్మణ్ ఉన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా కోటంరాజు

జూలూరుపాడు: తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా అన్నారుపాడుకు చెందిన కోటంరాజు ఎన్నికయ్యారు. గురువారం ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో సీనియర్ నాయకుడు చలమల గోవిందు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా పాపకొల్లుకు చెందిన రోకటి నరసింహారావు, సహాయ కార్యదర్శిగా వినోభానగర్‌కు చెందిన సిరికొండ తిరుమలరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ట్రాఫిక్ పోలీసులకు బారికేడ్లు వితరణ

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం న్యూరో అండ్ గ్యాస్ట్రో ఆస్పత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో గురువారం కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ సమక్షంలో కొత్తగూడెం ట్రాఫిక్ పోలీసులకు 20 బారికేడ్లను వితరణగా అందజేశారు. డీఎస్పీ మాట్లాడుతూ.. ఆస్పత్రి యాజమన్యం బారికేడ్లు అందజేయడం అభినందనీయమన్నారు. ట్రాఫిక్ ఎస్సై నరేష్, ఆస్పత్రి యాజమాన్యం పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం


విశ్వామిత్రను సన్మానిస్తున్న జడ్జి పాటిల్

కొత్తగూడెంటౌన్/చుంచుపల్లి: పర్యావరణ పరిరక్షణలో భాగంగా రోజుకో మొక్క నాటుతున్న కొత్తగూడెంకు చెందిన విద్యార్థి మూడ్ విశ్వామిత్ర చౌహాన్‌ను జిల్లా జడ్జి వసంత్ పాటిల్ గురువారం సన్మానించారు. ఇటీవల జీనియస్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కిన నేపథ్యాన ఆయనను సన్మానించి మాట్లాడారు. విశ్వామిత్ర స్ఫూర్తిగా అందరూ మొక్కలు నాటాలని సూచించారు. న్యాయవాది వై.నాయుడు, న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామిశెట్టి రమేష్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

పాల్వంచ: పట్టణంలోని కాకతీయుల కాలం నాటి శ్రీ ఆత్మలింగేశ్వరాలయంలో ఈనెల 19న ఆలయ ప్రతిష్టా మహోత్సవాల్లో భాగంగా గురువారం మహా కుంభాభిషేక మహోత్సవ పూజలతో ప్రారంభించారు. ఆలయ ధర్మకర్త మచ్చా శ్రీనివాసరావు, పూజారి జింతేంద్ర శర్మ, 15 మంది రిత్విక్కులు ప్రత్యేక పూజలు, రక్షాబంధనం, యాగశాల ప్రవేశం నిర్వహించారు.

ఉపాధి కార్మికుడికి గుండెపోటు

పాల్వంచరూరల్: మండలంలోని రెడ్డిగూడెంలో గురువారం 30మంది ఉపాధి హామీ పథకంలో భాగంగా రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారు. ఈక్రమాన వేల్పుల యాదయ్యకు గుండెపోటు రావడంతో కిందపడిపోయాడు. దీంతో ఆయనకు స్థానిక ఆర్‌ఎంపీ వద్ద చికిత్స చేయించాక పాల్వంచకు, అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

జాబ్‌మేళా మరిచారా ?


ఏరియా జీఎం కార్యాలయం

- ఉభయ జిల్లాల్లో ఎదురు చూస్తున్న వేలాది మంది నిరుద్యోగులు
- స్థానిక యువతకు అందని సింగరేణి ఫలాలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో 1990లో రన్నింగ్, వెయిట్ లిఫ్టింగ్ ద్వారా కంపెనీ ఉద్యోగాలు వచ్చేవి. ఆ తరువాత ఆ ఉద్యోగాలను కంపెనీ రిక్రూట్‌మెంట్ చేయక సుమారు 25 ఏళ్లు అవుతోంది. కంపెనీలో పనిచేసి మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికుల పిల్లలకు తప్ప, ఇతరత్రా ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయాయి. 2017లో 665 బదిలీ వర్కర్లకు (ఎస్టీ) మాత్రమే కల్పించారు. మరే ఇతర సామాజిక వర్గాల గురించి కంపెనీ కానీ, ఇతర వర్గాల నేతలు దృష్టి పెట్టకపోవటం వలన జిల్లాలో వేలాది మంది ఉద్యోగాలు లేక వలస బాట పడుతున్నారు. ఇది ఇలా ఉండగా, 2015లో కొత్తగూడెం ఏరియాలో జాబ్‌మేళా నిర్వహించారు. ఆ తరువాత సింగరేణి వ్యాప్తంగా జాబ్‌మేళా నిర్వహించి సుమారు పదేళ్లు అవుతుంది. దీంతో వేలాది మంది ప్రైవేటు పనులను ఆశ్రయిస్తే, అక్కడ నెలకు 15 రోజులు కూడా పని దొరకటం లేదు. వారు ఇచ్చే చాలీచాలని జీతాలతో దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారు. సింగరేణి యాజమాన్యం సీఎస్సార్ పాలసీలో భాగంగా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉండగా, కంపెనీలో పనిచేసే కొంతమంది అధికారులు సంస్థలో ఏమైనా అవుట్ సోర్సింగ్ ఖాళీలు ఏర్పడితే వారికి సంబంధించిన వారితో భర్తీ చేస్తున్నారు. దీంతో తెలంగాణ వారికంటే అంధ్రాకు చెందిన వారు కూడా అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో పెరిగిపోతున్నారు. ప్రశ్నించే వారు లేక వారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

జీకే ఓసీ మూతపడటంతో కరువైన జీవన భృతి..

కొత్తగూడెం ఏరియాలో గౌతంఖని ఓపెన్‌కాస్ట్ గని 1994 నుంచి 2020 వరకు ఓబీ పనులు నడిచాయి. ఆ తరువాత ఓసీలో బొగ్గు నిక్షేపాలు అయిపోయాయని, అంతలో రెండో విడత కరోనా రావటంతో ఓబీ నిర్వాహకులు పనులు లేవని చేతులెత్తేశారు. సుమారు 25 సంవత్సరాలు పనిచేసే కాంట్రాక్ట్ వర్కర్లు వారి కుటుంబ సభ్యులు రోడ్డు పాలయ్యారు.

ఏరియాలో రెండు ఓసీలు (జేవీఆర్‌ఓసీ, కిష్టారం ఓసీ)లలో కొత్తగూడెం వారికి అవకాశం వస్తుందనుకుంటే అక్కడి ఎమ్మెల్యేలు సత్తుపల్లి వారికి అవకాశం కల్పించాలని ఏరియా యాజమాన్యాన్ని కోరటంతో అక్కడి వారికే అవకాశం కలిగింది. దీంతో కొత్తగూడెం ఏరియా నిరుద్యోగులకు మూలికే నక్కపై తాటిపండు పడిన చందంలా మారింది. ఇదిలా ఉండగా, గతంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజనీరింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్‌లలో జాబ్‌మేళా నిర్వహించేవారు. ఇప్పుడు వారు కూడా ఆ విషయాన్ని పూర్తిగా విస్మరించారు. దీంతో నిరుద్యోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం స్పందించి జాబ్‌మేళా నిర్వహించాలని కార్మికులు, వారి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహించాలి..



గతంలో కంటే కార్మికుల పిల్లలు ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్స్, పోస్టు గ్రాడ్యుయేట్లు ఎక్కువగా ఉన్నారు. యాజమాన్యం ఐటీ కారిడర్ ఏర్పాటు చేయాలి. లేదా వివిధ కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహించాలి. – రజాక్, ఏరియా ఉపాధ్యక్షుడు

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలి...



స్కిల్ డెవలప్‌మెంట్ స్కీమ్ కింద కంపెనీ కారిడార్ హైదరాబాద్‌లో కాకుండా ఇక్కడే ఏర్పాటు చేయాలి. అందులో ఉత్పత్తి అయిన వాటిని కంపెనీ ఉపయోగించుకుంటే ఇతర పరిశ్రమల నుంచి ఖరీదు చేయాల్సిన అవసరం ఉండదు. – మొగిలిపాక రవి, బీఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు

ఉపాధి కల్పించాలి...



సింగరేణి వర్క్‌షాపులలో అప్రెంటిస్ వారితో ఏవిధంగా పనులు చేయిస్తుందో అదే విధంగా వర్క్‌షాపులను అభివృద్ధి చేసి, అదే ఐటీఐ చేసిన నిరుద్యోగులకు ఉపాధి కల్పించవచ్చు. ఇక్కడ ట్రైనింగ్ చేసిన తరువాత మరెక్కడైనా పనిచేసుకోవచ్చు స్వయం ఉపాధి యూనిట్ పెట్టుకోవచ్చు. – మధుకృష్ణ, ఏఐటీయూసీ నాయకుడు

త్వరలోనే జాబ్‌మేళా..



సింగరేణిలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో ట్రైనింగ్ ఇప్పిస్తున్నాము. అదేవిధంగా ఏరియాలో 800 మందికి అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ ఇస్తున్నాము. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారికి ఓల్వోలో శిక్షణ కూడా ఇప్పిస్తున్నాము. దీంతోపాటు త్వరలో వివిధ కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహించబోతున్నాము. – శాలేంరాజు, ఏరియా జీఎం

మానవతా విలువలు నేర్పించాలి

కొత్తగూడెంఅర్బన్: పిల్లలకు చదువు సంస్కారంతో పాటు మానవతా విలువలు నేర్పించాలని మోడ్రన్ ఇఖ్రా పాఠశాల కరస్పాండెంట్ షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు. స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతుల్లో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు.. విద్యార్థులకు నైతిక విలువలు కలిగిన మంచి మనిషిగా జీవించే మార్గం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఓ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్, ముర్తజా తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ

ఇల్లెందురూరల్: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం అని డీఎస్పీ చంద్రభాను అన్నారు. కొమరారం గ్రామంలో ఫెర్టిలైజర్ షాప్స్ అసోసియేషన్ సహకారంతో పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన ఏడు సీసీ కెమెరాలను గురువారం డీఎస్పీ ప్రారంభించారు. మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలోనూ సీసీ కెమెరాల ఏర్పాటులో స్థానికులు పోలీసు శాఖకు సహకరించడం ద్వారా నేర రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. ప్రధానంగా దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల వంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు నేరాన్ని నిర్ధారించడం, నిందితులను పట్టుకోవడానికి సీసీ కెమెరాలు మూడో నేత్రంగా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో గుండాల సీఐ రవీందర్, కొమరారం ఎస్సై నాగుల్‌మీరా, పొద్దుటూరి సురేష్, ప్రేమ్ కుమార్, నాగేశ్వరరావు, దాసరి వెంకన్న పాల్గొన్నారు.

శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలి

పాల్వంచ: మతపరమైన పండుగలను ప్రజలంతా ఆనందంగా, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని పాల్వంచ డీఎస్పీ ఆర్.సతీష్‌కుమార్ అన్నారు. జూన్ 7న జరగనున్న బక్రీద్ పండుగ సందర్భంగా గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ముస్లిం మతపెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ... పండుగలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా జరుపుకోవాలని ఆకాంక్షించారు. పండుగ ఏ మతానిది అయినా సామరస్యత మంచి సంబంధాలను పెంపొందిస్తుందన్నారు. బక్రీద్ పండుగకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు జరగకుండా మతపెద్దలు ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామని, ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. సమావేశంలో సీఐ కె.సతీష్, పట్టణ ఎస్‌ఐ కె.సుమన్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.


పాల్వంచ: మాట్లాడుతున్న డీఎస్పీ సతీష్‌కుమార్

ఇల్లెందు: బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో ఘనంగా జరుపుకోవాలని, ఇతరులు సహకరించాలని డీఎస్పీ ఎన్.చంద్రభాను కోరారు. గురువారం రాత్రి పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగిన పీస్ కమిటీ సమావేశంలో ముస్లిం, క్రైస్తవ, హిందూ సంఘాల నేతలతో చర్చించారు. ఏ పండుగ అయినా పరస్పరం సహకారంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్‌ఐలు శ్రీనివాసరెడ్డి, సూర్య ఉన్నారు.

ర్యాలీ, సభలను జయప్రదం చేయండి..


టేకులపల్లి: ఐక్యత చాటుతున్న జేఏసీ నాయకులు

టేకులపల్లి: ప్రధాని మోదీ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుదామని, రాబోయే రోజుల్లో ఉద్యమాలకు కార్మికులందరూ సిద్ధంగా ఉండాలని ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ సంఘాల నేతలు నజీర్ అహ్మద్, అబ్దుల్ నబీ, నాగేశ్వరరావు, బయ్యా వరప్రసాద్ పిలుపునిచ్చారు.

ఈనెల 20న జరగాల్సిన దేశవ్యాపిత సార్వత్రిక సమ్మె జూలై 9కి వాయిదా పడిందని 20న కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీలు, సభలు ఉంటాయని తెలిపారు. గురువారం కోయగూడెం ఓపెన్ కాస్టులో పిట్ మీటింగ్ నిర్వహించారు. మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తోందని కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో బాలాజీ, కే.వీరన్న, గుగులోత్ కృష్ణ, షేక్ సర్వర్, రాంబాబు, బాసు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో కార్మిక సంఘాలు ఈ నెల 20న నిర్వహిస్తున్న సభను జయప్రదం చేయాలని ఇఫ్టూ ఇల్లెందు ఏరియా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌రావు, నరాటి వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం చల్లసముద్రం గ్రామపంచాయతీలో ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. అంజయ్య, మహేందర్, సాయి, సర్వయ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: ఈనెల 20న కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా జరగనున్న ర్యాలీ, సభను విజయవంతం చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా ఉపాధ్యక్షుడు ఏదులాపురం గోపాల్‌రావు పిలుపునిచ్చారు. గురువారం జూలూరుపాడులో మాట్లాడారు. అంతకముందు కార్మికులతో కలిసి వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గంధం చంటి, నిమ్మటూరి గోపాల్‌రావు, శ్రీను, నరేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా రామకృష్ణ

జూలూరుపాడు: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా జూలూరుపాడుకు చెందిన మోదుగు రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య ఆదేశాల మేరకు గురువారం జూలూరుపాడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దళిత, ఎస్సీ నాయకులు, ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది.

నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్ నాయక్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా వెంగన్నపాలెంకు చెందిన గుంటక నరసింహా, ప్రధాన కార్యదర్శిగా కరివారిగూడెంకు చెందిన ఉబ్బపల్లి రాము, మరో 15 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం రామకృష్ణను సన్మానించారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

కొత్తగూడెంటౌన్: ఇందిరమ్మ ఇళ్లు అర్హులకే కేటాయిస్తారని, ఎవరైనా దళారులు ఇళ్లు ఇప్పిస్తామంటే నమ్మొద్దని రామవరం కాంగ్రెస్ యువజన నాయకుడు బానోత్ రాజ్‌కుమార్ అన్నారు. గురువారం చిట్టి రామవరంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల పక్షాన ఉంటుందని, ప్రతి పేదవానికి న్యాయం చేస్తుందన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి

పాల్వంచ: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని వెంగళరావు కాలనీ, రాహుల్ గాంధీనగర్, హమాలీ, వనమా కాలనీ, వికలాంగుల కాలనీ, వెంకటేశ్వర హిల్స్ కాలనీ, కాంట్రాక్టర్స్ కాలనీ, మార్కెట్ ఏరియా, టీచర్స్ కాలనీ, ఒడ్డుగూడెం, పాత పాల్వంచ ప్రాంతాల్లో రూ.3.20 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి సహకారం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, ఎస్‌కే సాబీర్‌పాషా, కొత్వాల శ్రీనివాసరావు, ముత్యాల విశ్వనాథం, అడుసుమల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

క్షణం నిర్లక్ష్యం.. శాశ్వత దుఃఖం


అవగాహన కార్యక్రమానికి హాజరైన కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): క్షణం నిర్లక్ష్యం.. శాశ్వత దుఃఖానికి కారణం అవుతుందని, పోలీసు భద్రత సూత్రాలను పాటించి సురక్షితమైన డ్రైవింగ్ చేస్తే, సంతోషకరమైన జీవితం ఉంటుందని, ఎల్లప్పుడూ హెల్మెట్ ధరించాలని వర్క్‌షాపు డీవైఎస్ఈ ఉపేందర్‌బాబు సూచించారు. గురువారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఏరియా వర్క్ షాపులో సేఫ్టీ డ్రైవింగ్, హెల్మెట్ ప్రాముఖ్యతపై కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ... వర్క్‌షాపు కార్మికులు వాహనాలు నడిపే సమయంలో తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అంతేకాకుండా రాంగ్ రూట్‌లో వెళ్లొద్దని, వర్క్‌షాపు నేషనల్ హై వే రోడ్డుకు సమీపంలో ఉన్నందున ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉందన్నారు. ట్రిపుల్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా డ్యూటీకి వస్తే కఠినమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ అనిల్‌కుమార్, పిట్ సెక్రటరీ మధుకృష్ణ, సత్తార్ పాష, ఫోర్‌మెన్లు పాల్గొన్నారు.

నీటి కుంటలను నిర్మించుకుందాం..

సుజాతనగర్: నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ అన్నారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'కార్యక్రమాన్ని గురువారం సర్వారం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి కుంటల ప్రాధాన్యతను రైతులకు వివరించారు. మాట్లాడుతూ.. జిల్లాలో తగినంత వర్షపాతం నమోదవుతున్నా రైతులకు సరైన అవగాహన లేక పంట నష్టం, నీటి వృథా సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితి నుంచి బయట పడాలంటే ప్రతీ రైతు తమ పొలాల్లో నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వృథాగా పోయే వర్షపు నీటిని ఒడిసి పట్టి పంటలకు వినియోగించుకోవాలని సూచించారు. నీటి కుంటలను ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వమే మంజూరు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ నర్మద, కేవీకే శాస్త్రవేత్త శివ, ఉద్యానవన అధికారి స్రవంతి, ఏఈఓ ప్రనూష తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త లక్ష్మీనారాయణమ్మ

ఏఐటీయూసీ పిట్ నూతన కమిటీ ఎన్నిక


కమిటీ వివరాలు మేనేజర్‌కు అందజేస్తున్న నాయకులు

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టు ఏఐటీయూసీ నూతన పిట్ కమిటీ ఎన్నికైంది. ఈ మేరకు గురువారం కేఓసీలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో బ్రాంచి కార్యదర్శి ఎం.నజీర్ అహ్మద్ సమక్షంలో నూతన కమిటీని ప్రకటించారు. ఆ తరువాత కేఓసీ మేనేజర్ పేరాల శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిసి నూతన కమిటీని పరిచయం చేశారు. కార్యదర్శిగా బానోత్ బాలాజీ, సహాయ కార్యదర్శులుగా షేక్ సర్వర్, బి.బాలుకుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గుగులోత్ కృష్ణ, ధర్మసింగ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. షిఫ్ట్ ఇన్‌చార్జ్‌లుగా జనరల్ షిఫ్ట్ ఇన్‌చార్జ్ సామల శ్రీనివాస్, ఏ రిలే ఇన్‌చార్జ్ మహ్మద్ సద్దాత్ హుసేన్, బి రిలే ఇన్‌చార్జ్ మహ్మద్ షబ్బీర్, సీ రిలే ఇన్‌చార్జ్ బి.అశోక్ కుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బ్రాంచి కార్యదర్శి నూతన కమిటీకి పలు సూచనలు చేశారు. బాధ్యతాయుతంగా పనిచేయాలని కార్మికుల సమస్యలపై నిత్యం స్పందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు, హతీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన భూభారతి రెవెన్యూ సదస్సులు

సుజాతనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూ భారతిలో భాగంగా రెవెన్యూ సదస్సుల నిర్వహణకు పైలెట్ ప్రాజెక్టుగా సుజాతనగర్ మండలాన్ని ఎంపిక చేసిన విషయం విధితమే.

ఇందులో భాగంగా ఈ నెల 6 నుంచి మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు గురువారంతో ముగిశాయి. చివరి రోజు సుజాతనగర్, నాయకులగూడెం గ్రామ పంచాయతీల్లో సదస్సులు నిర్వహించారు. ఇప్పటి వరకు మండలంలో 2,835 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ జి.శిరీష తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ముగిసిందని.. సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

అడుగంటిన మంచినీటి చెరువు

- ఇల్లెందులో తాగునీటికి కటకట
- ఆదుకోని మిషన్ భగీరథ

ఇల్లెందు: ఏటా ఎండాకాలం ఇల్లెందులో మంచినీటికి కటకట ఏర్పడుతోంది. 24 వార్డులు, 50 వేల ప్రజలు దాహార్తి తీర్చడం కష్టంగా ఉంది. తలాపున కోరగుట్ట మీద మిషన్ భగీరథ ట్యాంక్ ఉన్నా పట్టణానికి పూర్తిస్థాయిలో తాగునీరు అందడం లేదు. దీంతో నిండు వేసవిలో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇల్లెందుకు ప్రత్యేక పరిస్థితి..

జిల్లాలో ఏ పట్టణానికి లేని ప్రత్యేక పరిస్థితి ఒక్క ఇల్లెందులోనే ఉంటుంది. ఇక్కడి పట్టణం కింద పురాతనంగా బొగ్గు బావులు తీసి ఉండటం వల్ల బోర్లు పడే అవకాశం లేదు. దీనివల్ల అనాదిగా చెరువు మీద ఆధారపడి జీవించారు. కొంతకాలం కోటిలింగాల నుంచి నీటిని మళ్లించారు. కానీ అక్కడి నీటి వాడకం వల్ల విద్యుత్ చార్జీలు ఎక్కువ వడంతో నిలిపివేశారు. ఈ క్రమంలో మిషన్ భగీరథ రావడంతో కష్టాలు తీరినట్లేనని స్థానికులు సంబుర పడ్డారు. కానీ భగీరథ నీరు ఏనాడూ పట్టణానికి పూర్తిస్థాయిలో ఒక రోజంతా ఇవ్వలేకపోతోంది. దీనికి తోడు నల్లాల ఏర్పాటు, లైన్ల అనుసంధానం అసంపూర్తిగా వదిలేశారు. దీంతో వేసవికాలం వచ్చిందంటే అంతా చెరువు వైపే చూడాల్సి వస్తోంది.

అడుగంటుతున్న జలాశయం..

ఇల్లెందు మంచినీటి చెరువు అడుగంటుతోంది. ఇప్పటికే మూడొంతుల నీరు తగ్గిపోయింది. ఈ నెల రోజులు గడిస్తే చాలు అన్నట్లు మారింది. స్థానికుల దాహార్తి తీర్చడానికి చెరువు నీరు, 47 లెవల్ పైపులైన్ నీరు, సింగరేణి నీరు, భగీరథ నీరు అందిస్తున్నా అందరికీ అందడం లేదు. మూడు రోజులకోసారి నీరు ఇస్తున్నారు.


నీళ్లు తగ్గుముఖం పట్టిన ఇల్లెందు చెరువు

రక్షణ చర్యలు అంతంత మాత్రమే..

ఇల్లెందు మంచినీటి చెరువు రక్షణ చర్యలు అంతంత మాత్రంగా ఉన్నాయి. చెరువులో నీరు అడుగంటుతుండటంతో చేపల వేట ముమ్మరంగా సాగుతోంది. వారం రోజుల క్రితం ఓ వ్యక్తి వేట కోసం వెళ్లి చెరువులో మునిగి మృతి చెందాడు. నిత్యం చెరువు మీద గస్తీ కాయాల్సిన చోట వేట కోసం వెళ్లి మృతి చెందటం ఆందోళనగా మారింది. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.


నీళ్లు లేక బయట పడిన గుమ్మసం

భగీరథ నీరు ఇవ్వాలి..



ఇల్లెందు పట్టణానికి మిషన్ భగీరథ నీరు సరఫరా చేయాలి. నీటి ఎద్దడి రాగానే చెరువు నీరు సరఫరా చేయటం కాకుండా భగీరథ నీటినే పట్టణం అంతా ఇవ్వాలి. భగీరథ నీరు ఫిల్టర్ అవుతుంది. చెరువు నీటిలో పురుగులు, కప్ప పిల్లలు వస్తున్నాయి. – యాకుబ్‌షావలీ, ఇల్లెందు

చెరువు రక్షణపై దృష్టి..



ఇల్లెందు మంచినీటి చెరువులోకి పశువులు, ప్రజలు రాకుండా కంచె ఏర్పాటు చేశాము. చేపల వేట మీద చర్యలు తీసుకుంటాము. వేసవికాలంలో నీటి ఎద్దడి తీర్చేందుకు అటు భగీరథ ఇటు చెరువు నీరు ఇవ్వక తప్పదు. – సీహెచ్.శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్, ఇల్లెందు